

చిన్నారులకు విద్యాబోధన

అమ్మానాన్నలు ఎయిడ్స్ బారిన పడి తీరని వేదన అనుభవిస్తున్నారు.. తెలిసినా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి.. అయినవారు ఆదరించలేదు.. తనను ఈ లోకంలోకి తీసుకొచ్చిన వారు కళ్ల ముందే తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు.. రోజూ ఒంటరి తనంతో పోరాటం.. ఇక చిన్నతనంలోనే కన్న వారు చనిపోయిన వారి పరిస్థితి కళ్ల ముందు కదలాడింది.. గుండె చివుక్కుమంది.. లక్ష్యం బోధపడింది.. అంతే ఆయన ప్రభుత్వ ఉద్యోగం వదిలి సేవకు కదిలారు.. వ్యాధిపై అవగాహన పెంచుకుని స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేశారు.. ఎంతో మంది జీవితాల్లో వెలుగు పూలు పూయిస్తున్నారు.

- ఎయిడ్స్ బాధితుల పిల్లలకు విద్యాబుద్ధులు
- యువతకు ఉపాధి శిక్షణ
- బాధను దిగమింగి వెలుగులు పంచుతున్న దంపతులు

# చీకటి చిన్నబోయింది...
# వెలుగై వెంట నడిచింది!

న్యూస్‌టుడే, శామీర్‌పేట

గుంటూరు జిల్లా వట్టి చెర్కూర్ మండల కేంద్రానికి చెందిన ఐగ్గా వేంకటేశ్వర్లు, వీరమ్మలది వ్యవసాయ కుటుంబం. వారికి ముగ్గురు కొడుకులు. అన్నలు పెద్దగా చదువుకోలేదు. ఈ కుటుంబంలో అందరికన్నా చిన్నవాడు వెంకట్రావ్. ప్రాథమిక విద్యతో పాటు జూనియర్ కళాశాలో ఎంపీసీ స్థానికంగా సాగింది. నగరంలోని మాసాబ్ ట్యాంక్‌లో బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్ డిగ్రీని పూర్తి చేసిన వెంటనే సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో డ్రాయింగ్ మాస్టారుగా ప్రభుత్వ ఉద్యోగంలో చేరారు. జీవితం సాఫీగా సాగిపోతున్న తరుణంలో అనుకోని కుదుపు ఆయనను విషాదంలోకి నెట్టేసింది.

## చీకటిపై చైతన్య సమరం...

తన తండ్రి వేంకటేశ్వర్లు 1994లో ఎయిడ్స్ వ్యాధితో మృత్యువాత పడ్డారు. తరువాత 2000లో అమ్మ వీరమ్మ మృతి చెందారు. ఎయిడ్స్ మహమ్మారి తన తల్లిదండ్రులను పొట్టన పెట్టుకుందని మదన పడిన వెంకట్రావ్‌కు ఎయిడ్స్ వ్యాధి బారినపడిన వారి పిల్లలు అనాథలుగా మారకుండా తాను ఏదైనా చేయలనే తలంపు వచ్చింది. తన లక్ష్యం, ఆశయం నేరవేరాలంటే ఉన్న ఉద్యోగం అడ్డు వస్తుందని 2001లో వదిలేశారు. ఎయిడ్స్, హెచ్ఐవీపై అవగాహన పెంచుకోవడానికి ఆరేళ్ల పాటు వివిధ స్వచ్ఛంద సంస్థల్లో ముమ్మర ప్రచారం నిర్వహించారు.

## అరుణోదయ ట్రస్టుకు అంకురార్పణ

తల్లిదండ్రులు ఎయిడ్స్ వ్యాధి బారిన పడి మృత్యువాత పడితే వారి పిల్లలను అయినవారు సైతం దరిచేరనీయని దుస్థితిని గుర్తించిన వెంకట్రావ్ శామీర్‌పేట మండలం జవహర్‌నగర్ గ్రామానికి వచ్చి 2008లో 'అరుణోదయ ట్రస్టు'కు అంకురార్పాణ చేశారు. ముఖ్యంగా హెచ్ఐవీ, ఎయిడ్స్ బారిన పడిన కుటుంబాల పిల్లలను అక్కున చేర్చుకొని 35 మంది చిన్నారులకు విద్యాబుద్ధులు చెప్పిస్తున్నారు. సమాజంలో వారికి ఉన్నతమైన స్థానాన్ని కల్పిస్తున్నారు. వీరితోపాటు మరో 45 మంది నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఉచితంగా బోధన చేస్తున్నారు. ఆయన భార్య ధనలక్ష్మీ సైతం సేవా యజ్ఞంలో తనవంతు పాత్ర పోషిస్తున్నారు. తనకున్న ఇద్దరు కుమారులతో సమానంగా మిగతా పిల్లలను చూస్తు భర్త అడుగు జాడల్లో నడుస్తున్నారు.






విద్యార్థులకు పాఠాలు చెబుతూ...

## ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



– వెంకట్రావ్, అరుణోదయ ట్రస్టు నిర్వాహకులు

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలనేది నా తపన. ప్రస్తుతం ఉన్న స్థలానికి అద్దె కట్టి నడిపిస్తున్నాం. ప్రభుత్వం చేయూత అందిస్తే మరింత మందికి సేవలు విస్తరించాలని ఉంది. పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) లాంటివి ఏర్పాటు చేసి ఉపాధి శిక్షణ విస్తరించాలని ఉంది.

## యువతకు, నిరుద్యోగులకు శిక్షణ

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పిల్లలు, నిరుపేద పిల్లలకు 15 మంది ఉపాధ్యాయులను పెట్టి ఉచితంగా విద్య అందిస్తున్నారు. ఇప్పటివరకు ఎనిమిది బృందాలకు విజయవంతంగా శిక్షణ పూర్తి చేశారు. వీరిలో 350 మంది ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. మహిళలకు కుట్టుశిక్షణ, శారీ పెయింటింగ్‌పై శిక్షణ ఇస్తున్నారు. దాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఈ సేవలు చేస్తున్నారు. ప్రతి శని ఆదివారాల్లో వివిధ కళాశాలల విద్యార్థులు ఈ ట్రస్టుకు వచ్చి విద్యాబోధన చేస్తున్నారు.

## కుంచె పడితే అద్భుత చిత్రాలు

వెంకట్రావ్ కుంచె పడితే అద్భుత చిత్రాలు ఆవిష్కృతమవుతాయి. ఇందులోనూ ఆయన సమాజ కోణాన్ని చూస్తారు. ఎయిడ్స్‌పై చైతన్యం నింపడానికి చిత్రాలు గీసి ప్రదర్శనకు ఉంచుతున్నారు. పలువురు రాష్ట్ర ప్రముఖుల చేత భేష్ అనిపించుకున్నారు.


చిత్రప్రదర్శన తిలకిస్తున్న శాసనసభాపతి నాదెండ్ల మనోహర్

శుక్రవారం | జూలై | 16 | 2010
సాక్షి 24|7
హైదరాబాద్
9


పాదయాత్ర ప్రస్థానంలో జననేత చిత్రం...

జీవితం కాన్వాస్‌పై...

# సేవా చిత్రం

చిత్రకళ అంటే మక్కువ. పేదరికంలో పుట్టినా రంగుల ప్రపంచంలో విహరిస్తూ కాలం కాన్వాస్‌పై తన జీవితాన్ని వెలిగించుకోవాలనుకున్నాడు. ఎంచుకున్న వృత్తిలో పరిపూర్ణత సాధించాడు. బిడ్డకు బంగారు భవితను ఇచ్చేందుకు కష్టాలను, కన్నీళ్లను దిగమింగిన కన్నవారికి తన గుండెల్లో గుడి కట్టుకున్నాడు. అమ్మానాన్నలను పువ్వుల్లో పెట్టి చూసుకోవాలని కలలుగన్నాడు. అంతలోనే విధి కన్నవాళ్లను దూరం చేసింది. కాలం చేసిన గాయం అయనకు మరో పంథాను చూపింది. ఇప్పుడు సేవ అతని జీవితమైంది. అనాథల జీవితాల్లో అరుణోదయ కిరణాన్ని ప్రసరింపజేస్తున్నాడు.

– [illegible], న్యూస్‌లైన్


వెంకటరావు

[illegible]

...సంప్రదించాల్సిన నెంబర్ 99488 93059.

[illegible]




అనాథలకు విద్యాబుద్ధులు నేర్పుతూ...


వెంకటరావు గీసిన చిత్రరువు... రైతు బిడ్డగా వైఎస్

# రసరమ్యం..ఈ దృశ్య కావ్యం





వందల మాటల భావాల్ని ఒక చిత్రంలో చూపించవచ్చు. కొన్ని చిత్రాలు ఆహ్లాదాన్ని కల్గిస్తుంటాయి, మరికొన్ని చిత్రాలు జీవితంలో జరిగిన కొన్ని మధురానుభూతులను గుర్తుకు తీసుకువస్తుంటాయి. మరికొన్ని చిత్రాలు ఆలోచనలు రేకెత్తిస్తుంటాయి. ఆ ఆలోచలలో తెలియని భావం, తియ్యని కమ్మదనం కనిపిస్తుంది. అలాంటి చిత్రాలను ఆయన అవలీలగా గీసేస్తారు. ఆయనే వెంకట్ రావు. ఆయన ఇప్పటికి ఒకటి కాదు.. రెండు కాదు 1000కి పైగా చిత్రాలు గీశారు. శామీర్‌పేట మండలం జవహర్‌నగర్‌లో నివసించే ఇతను ఎనిమిదేళ్ల వయస్సు నుంచే ఈ చిత్రాలు గీస్తూ ఇప్పటికీ అదే వృత్తిని కొనసాగిస్తున్నాడు. ఏకంగా ఒక అరుణోదయ ట్రస్టును ఏర్పాటు చేశారు. క్రిస్మస్ సందర్భంగా జీసెస్ జీవితంలోని కొన్ని ముఖ్యమైన ఘట్టాలను చిత్రించారు.

-న్యూస్‌లైన్, జవహర్ నగర్

# శోకమే.. శ్లోకమై

- కన్నవారు దూరం.. ద్రవించిన హృదయం
- అనాథలకు విద్యాబుద్ధులు నేర్పిస్తూ...
- మహిళలకు వివిధ వృత్తివిద్యా కోర్సుల్లో శిక్షణ
- అభాగ్యులకు బాసటగా నిలుస్తున్న అరుణోదయ ట్రస్ట్ నిర్వాహకుడు వెంకటరావు




ఆదివారం **ప్రత్యేకం**


వివరాలు 7వ పేజీలో ▶


**కాలం చేసిన గాయం మానవతా** గేయంగా మారింది.. తల్లిదండ్రులు దూరమైన శోకం నుంచి ఓ శ్లోకం రగిలింది.. ఆ చీకటి ఎదలో చిరు దీపం వెలిగింది.. ప్రభుత్వోద్యోగం తృణప్రాయంగా.. అభాగ్యుల సేవే జీవిత పరమావధిగా భావించి.. అనుకున్నదే తడవుగా కార్యాచరణకు పూనుకున్నారాయన.. దాతల ఆర్థిక సహాయంతో అరుణోదయ స్వచ్ఛంద సంస్థను స్థాపించారు.. అనాథలకు నీడ కల్పించారు.. పేదల జీవనోపాధికి వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణనిచ్చి వారి జీవితాల్లో వెలుగు రేఖలు నింపుతూ మానవతావాదానికి మరోరూపుగా నిలిచారు.. తాను అమితంగా అభిమానించే చిత్రకళలో రాణిస్తూనే.. అనాథ చిన్నారులను అక్కున చేర్చుకుని.. వారికో దారిచూపుతున్నారు ఖగ్గా వెంకటరావు. ఆయన జీవితంలో చీకటి వెలుగుల కోణం.. అభాగ్యులకు అండగా నిలిచిన సేవాభావమే ఈ కథనం.



అనాథ విద్యార్థులతో వెంకటరావు, ఇనసెట్లో.. ఖగ్గా వెంకటరావు

**Saakshi-17-07-2011**

# శోకమే.. శ్లోకమై


జవహర్‌నగర్, న్యూస్‌లైన్:

గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు వాసి ఖగ్గా వెంకటరావు. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. బాల్యం నుంచే ఆయనకు చిత్రకళపై మక్కువ ఎక్కువ. జేఎన్‌టీయూలో ఫైన్ ఆర్ట్స్ చదివేందుకు 1989లో నగరానికి వచ్చారాయన. కోర్సు పూర్తయిన అనంతరం గుంటూరు జిల్లా కారంపూడి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 1997లో డ్రాయింగ్ టీచర్‌గా చేరారు. కుటుంబానికి ఆసరాగా నిలిచి కన్నవారి కలల్ని సాకారం చేయాలనుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రాణాంతక వ్యాధితో ఆయన తల్లిదండ్రులు మృతిచెందారు. తల్లిదండ్రులు దూరం కావడంతో ఆయన ఆలోచనా సరళిలో మార్పు వచ్చింది. అమ్మానాన్నల్ని కోల్పోయిన పిల్లల పరిస్థితి ఎలా ఉంటుందో అనుభవపూర్వకంగా తెలుసుకున్న వెంకటరావు 2001లో ఉద్యోగానికి రాజీనామా చేశారు. హైదరాబాద్ సమీపంలోని శామీర్‌పేట్ మండలం జవహర్‌నగర్‌లో 2006లో అరుణోదయ స్వచ్ఛంద సేవా సంస్థను నెలకొల్పారు. ఎయిడ్స్ బాధితులను, అనాథ పిల్లలను అక్కున చేర్చుకున్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. స్క్రీన్ ప్రింటింగ్, చాక్‌పీసుల తయారీలో శిక్షణ ఇస్తున్నారు. వెంకటరావు అర్ధాంగి ధనలక్ష్మి సైతం ఖర్చ ఆడుగుజాడల్లో నడుస్తున్నారు. మహిళలకు కుట్టుమిషన్, ఎంబ్రాయిడరీ ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లలో శిక్షణ ఇస్తున్నారు. హెచ్‌ఐవీ బాధితులను గుర్తించి వారికి క్రమం తప్పకుండా చికిత్సతోపాటు పలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో మందులు, నిత్యావసర వస్తువులు అందజేస్తున్నారు. ప్రస్తుతం ట్రస్టులో 15 మంది చిన్నారులు ఉన్నారు. మరికొందరు ట్రస్టులో ఉపాధి శిక్షణకు వచ్చిపోతుంటారు. దాతల నుంచి అందే ఆర్థిక సహాయంతోనే సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వెంకటరావు తెలిపారు. దాతలు సహకరిస్తే తమ సేవల్ని మరింత విస్తరించేందుకు సిద్ధమంటున్నారు వెంకటరావు. 99488 93059 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

**చిత్రకళపై మక్కువ వీడలేదు**

వృత్తిని వదిలివేసినా దానినే ప్రవృత్తిగా స్వీకరించారు వెంకటరావు. సేవే పరమావధిగా జీవనం సాగిస్తూనే మరోవైపు చిత్రకళపై మక్కువ మాత్రం వీడలేదు. కళాకారుడిగా తన కుంచెను కదిలించి అద్భుత చిత్తరువులకు జీవం పోస్తున్నారు. మదిలో మెదిలే ఆలోచనలకు రూపం ఇస్తూ కళాభిమానులకు కనువిందు చేస్తున్నారు. జన హృదయ నేత వైఎస్ పాదయాత్రను 40 చిత్రాలలో ప్రతిబింబింపజేశారు. ఇటీవల రవీంద్రభారతిలో వైఎస్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన చిత్రాలను పలువురు నాయకులు తిలకించారు.







రవీంద్ర భారతిలో వెంకటరావు వేసిన వైఎస్ఆర్ చిత్రాలను పరిశీలిస్తున్న నాయకులు, వెంకటరావు గీసిన వైఎస్ఆర్ చిత్రం, ట్రస్టులో డ్రాయింగ్ పోటీల నిర్వహణ, కంప్యూటర్ నేర్చుకుంటున్న చిన్నారులు(ఫైల్)



# ఆపన్న హస్తం

**అభాగ్యులకు అండగా నిలుస్తున్న అరుణోదయ స్వచ్ఛంద సంస్థ**

**అనాథల జీవితాల్లో వెలుగులు నింపుతున్న కగ్గ వెంకటరావు**

**కన్నవాళ్లను కోల్పోయి.. అయినవారి అప్యాయతానురాగాలకు నోచుకోని అభాగ్యులను ఆదుకోవడానికి ముందుకువచ్చాడు ఓ దయార్ద్ర హృదయుడు. తాను అనుభవించిన క్షోభ మరొకరికి రాకూడదనే తలంపుతో హెచ్ఐవీ కారణంగా తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులను అక్కున చేర్చుకోవడానికి ముందుకువచ్చాడు. అనాథ పిల్లల సేవకు జీవితం అంకితం చేయడం కోసం ప్రభుత్వ ఉద్యోగాన్ని సైతం వదులుకున్నాడు.** -జవహర్‌నగర్





డ్రాయింగ్ టీచర్‌గా ప్రభుత్వ ఉద్యోగం చేస్తూన్న కగ్గ వెంకటరావు తండ్రి వెంకటేశ్వర్లు 1994లో, తల్లి వీరమ్మ 2000 సంవత్సరంలో మరణించారు. కళ్ల ఎదుట కన్నవారు దూరమైతే ఆ బాధ ఎలా ఉంటుందో స్వయంగా అనుభవించిన ఆయన తనలా మరొకరు బాధపడకూడదని నిశ్చయించుకున్నాడు. హెచ్ఐవీ కారణంగా తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలను ఆదుకోవడానికి పూనుకున్నాడు. 'అరుణోదయ' స్వచ్ఛంద సంస్థ ద్వారా హెచ్ఐవీ కారణంగా తల్లదండ్రులను కోల్పోయిన చిన్నారులను ఆదుకుంటున్నాడు. ఇందుకోసం ఇష్టంతో చేస్తున్న డ్రాయింగ్ టీచర్ ఉద్యోగానికి రాజీనామా చేశాడు. ఎయిడ్స్‌పై అవగాహనకోసం నాలుగు సంవత్సారాల పాటు వివిద స్వచ్ఛంద సంస్థల్లో పనిచేశారు. నగరానికి సమీపంలో ఉన్న జవహర్‌నగర్‌లో స్థలాన్ని కొనుగోలు చేసి 2006లో అరుణోదయ స్వచ్ఛంద సంస్థను నెలకొల్పాడు. ఎయిడ్స్ బాధితులను, అనాథ పిల్లలను అక్కున చేర్చుకున్నాడు. వారికి విద్యాబుద్ధులు నేర్పిస్తూ సమాజంలో ఉన్నతమైన స్థానాన్ని కల్పించడానికి కృషిచేస్తున్నాడు. చుట్టుపక్కల ఊళ్లలో ఉన్న హెచ్ఐవీ బాధితులను గుర్తించి స్వచ్ఛంద సంస్థల సహకారంతో క్రమం తప్పకుండా మందులు అందజేస్తున్నాడు. ప్రస్తుతం అరుణోదయ సంస్థలో 40 మంది చిన్నారులు ఉన్నారు. దీంతో పాటు వారి సంస్థ తరపున నిరుద్యోగ యువతకు వివిధ రంగాల్లో ఉపాధి శిక్షణ ఇస్తున్నారు. వెంకటరావు భార్య సైతం మహిళలకు కుట్టుమిషన్, ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లలో శిక్షణ ఇస్తూ భర్తకు తగిన భార్యగా పేరుతెచ్చుకున్నారు. డ్రాయింగ్ టీచర్ ఉద్యోగాన్ని వదిలేసినా చిత్రకళపై మక్కువ వీడలేదు. ఇప్పటికీ కళాకారుడిగా అద్భుత చిత్రాలకు జీవం పోస్తున్నాడు. ఎయిడ్స్‌పై చైతన్యం తీసుకురావడానికి చిత్రాలను గీసి ప్రదర్శనలు నిర్వహిస్తున్నాడు.

## స్వయం ఉపాధితో ఆత్మవిశ్వాసం పెరిగింది

అరుణోదయ స్వచ్ఛంద సంస్థలో ఉచితంగా కుట్టు అల్లికలు నేర్చుకోవడంతో నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. అనాథగా ఉన్న నేను మరికొందరికి అసరాగా ఉండేందుకు కృషిచేస్తా. శిక్షణ పూర్తి అయిన తరువాత కొత్త కొత్త డిజైన్లను నేర్చుకుని తోడుగా నిలిచిన అరుణోదయ స్వచ్ఛంద సంస్థకు అండగా నిలుస్తా.

– జీవిత





## ఉచిత శిక్షణ ఉపాధికి ఉపయోగ పడుతుంది

వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పొందేందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఇంత కాలం ఏమీ చేయలేకపోయాను. పోలియో కారణంగా అంగవైకల్యం ఏర్పడింది. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. అరుణోదయ ట్రస్టులో ఉచితంగా కంప్యూటర్ శిక్షణ పొందుతున్నాను. శిక్షణలో అనేక విషయాలు నేర్చుకుంటున్నాను. దీంతో ఉపాధిపై భరోసా ఏర్పడింది.

– సామ్యూల్ బాబు

## అనాథలను ఆదుకోవడంలోనే ఆత్మ సంతృప్తి

పేద విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వడం నాకు సంతృప్తినిస్తోంది. ఎయిడ్స్ బారిన పడిన అనాథలను చేరదీసి వారిని ప్రయోజకులను చేయడానికి కృషిచేస్తున్నా. వాళ్ళు జీవితంలో స్థిరపడితే ముందుగా సంతోషించేది నేనే. పేద వాళ్ల దీవెనలు నాకు కొండంత అండ.

– కగ్గ వెంకటరావు, అరుణోదయ ట్రస్టు చైర్మన్



